సాక్షి
హైదరాబాద్ । సోమవారం । 26 । ఆగస్టు । 2024



## రవీంద్రనగర్‌కాలనీ అధ్యక్షుడిగా విజయ్‌సింగ్



సనత్‌నగర్: సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్‌కాలనీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.విజయ్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా ఎన్వీరమణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సుదర్శన్, కిరణ్ కిషోర్, కోశాధికారిగా రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా హనుమంతు కాయిత, చీఫ్ ప్యాట్రన్స్‌గా ఆర్.సత్యనారాయణ, సూర్యనారాయణ, రామిరెడ్డి, సాంబశివరావు, సలహాదారులుగా నీలం రమేష్, హరికృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బలం సంతోష్, సీహెచ్.రవీందర్‌రెడ్డి, సాగర్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, మార్టిన్, ముద్దాపురం దిలీప్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన విజయ్‌సింగ్ మాట్లాడుతూ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డిల సహకారంతో కాలనీ మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎప్పటికప్పుడు కాలనీ సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. కాలనీవాసులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాన్నారు.

## ప్రజల కోసం పనిచేయాలి

రాంగోపాల్‌పేట్: కేటీఆర్ ఇప్పటికైనా అబద్ధాలు మానుకుని ప్రజల కోసం పనిచేయాలని లేకపోతే నామరూపాల్లేకుండా పోతారని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కార్యదర్శి గంట సుధీర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీతి, నిజాయితీ కలిగిన మాజీ ఎంపీ మధు యాష్కిగౌడ్‌కు ఫాంహౌజ్‌లు ఉన్నాయని అవాకులు, చెవాకులు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవపట్టించాలని కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు.

## బీజేపీలోనే సేవాభావం

బౌద్ధనగర్: జాతీయ భావజాలం బీజేపీలోనే ఎక్కువగా ఉందని, సేవా గుణమున్న కార్యకర్తలకు కమలం పార్టీలో లోటు లేని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి తలపెట్టనున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్న బీజేపీ సభ్యత్వ నమోదును ఈ సారి రెట్టింపు ఉత్సాహంతో కార్యకర్తలందరూ పాల్గొని సభ్యత్వం మరింత జోరుగా చేయాలన్నారు.

## విద్యార్థులను ప్రోత్సహించేందుకే అవార్డులు



విద్యార్థినికి అవార్డుతో పాటు చెక్కును అందజేస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

సికింద్రాబాద్: విద్యార్థులను ప్రోత్సహించడానికి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో మెరిట్ స్టూడెంట్స్‌కు అవార్డ్స్‌తో పాటు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా సీతాఫల్‌మండికి చెందిన గాజుల చైతన్యశ్రీ పదవ తరగతిలో మెరిట్ మార్క్స్ సాధించినందుకు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్ట్ వారు విద్యార్థిని గాజుల చైతన్యకు గోల్డ్ మెడల్‌తో పాటు చెక్కును ఆదివారం అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి మున్నూరు కాపు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులకు విద్యార్థిని కుటుంబసభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం



బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జ్యోతిరెడ్డి

ముషీరాబాద్: నవభారత, వనితా లయన్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్ అనాథాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు డాక్టర్ పి.జ్యోతిరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొగ్రెసీవ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలు హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. చదువుతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయాలని అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణవేణి, రెయిన్‌బో హోమ్ ఇన్‌చార్జి సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన గుంతలు



లాలాపేట: తార్నాక డివిజన్ ఆర్యనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డంతా తవ్వడంతో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయ్యింది. అక్కడక్కడా తెరుచుకున్న మ్యాన్ హోల్ గుంతల్లో మురుగు నీరు నిండి పొంగి పారుతుంది. ఈ ప్రాంతంలోని వారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో పాటుగా రాత్రి వేళలలో కానక ఈ మార్గంలో వెళితే అందులో పడే ప్రమాదం పొంచి ఉంది. కావునా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆర్యనగర్ వాసులు కోరుతున్నారు.

## వైద్యులు లేరు..

వైద్యం.. ప్రజల కనీస అవసరం.. ఇది ప్రభుత్వం అందించాల్సిన కనీస బాధ్యత.. అయితే ఈ వైద్యం లాలాపేటలో మాత్రం అందడం లేదు.. అధికారులూ పట్టించుకోవడం లేదు.. ప్రభుత్వమూ గాలికి వదిలేసింది.. దీంతో జనం చికిత్స కోసం అవస్థలు పడుతున్నారు.

\- లాలాపేట

# వైద్యం అందదు

- డాక్టర్లు లేక నెలరోజులుగా జనం అవస్థలు



లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

తార్నాక డివిజన్ లాలాపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక దాదాపుగా నెల రోజులు గడుస్తోంది. దీంతో వైద్య సేవలకు తీవ్ర ఆంతరాయం ఏర్పడింది. ఇటీవల వైద్య శాఖలో జరిగిన బదిలీల్లో ఇక్కడ ఇంతకాలం విధులు నిర్వహించిన వైద్యులు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ ఆరోగ్య కేంద్రానికి కొత్త వైద్యులు రాలేదు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంబీబీఎస్ వైద్యులు అందించాల్సిన వైద్యాన్ని ఓ ఆయుష్ డాక్టర్‌తో, సిస్టర్స్‌తో అందిస్తూ హాస్పిటల్‌ను నిర్వహిస్తున్నారు. ఒక వైపు విష జ్వరాలతో బాదపడుతున్న వారు హాస్పిటల్‌కు క్యూ కడుతుంటే చేసేదేమి లేక సిబ్బంది పక్కనే ఉన్న పట్టణ సామాజిక కేంద్రానికి పంపిస్తున్నారు. రోగుల తాకిడి ఎక్కువై అక్కడా సరైన వైద్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయినా పట్టించుకునే వారే లేరు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోనే వైద్యం అందించేవారు అందుబాటులో లేని వైనం నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్యులను నియమించాలనీ కోరుతున్నారు.

## ఉద్యమకారులకు అవకాశాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు పాలన పదవుల్లో అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి మార్కలను కోరారు. ఆదివారం ఆర్ట్ కాలేజీలో ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు భట్టు శ్రీహరి అధ్యక్షత కాంగ్రెస్ విద్యార్థి ఉద్యమ సదస్సు జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినాటి నుంచి అమలు చేస్తున్న వివిధ పథకాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యకారులకు 10 కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, 2 ఎమ్మెల్సీలు, ఒక రాజ్యసభ, జిల్లా పరిషత్తు ఛైర్మన్లు, మున్సిపల్ ఛైర్మన్లు, కమిషన్ మెంబర్లతో పాటు హైదరాబాద్‌లో 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని తర్వలో సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులను కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిడమర్తి రవి, లోకేష్‌యాదవ్, మానవత రాయ్, వట్టికూటి రామారావుగౌడ్, చరణ్‌కౌశిక్ యాదవ్, వంగరల్ రవి, బొమ్మ హనుమంతరావు, మందాల భాస్కర్, దరువు ఎల్లన్న, శ్రీధర్‌గౌడ్, దుర్గం భాస్కర్, కేతురి వెంకటేష్, రవీంద్రనాయక్, రెడ్డి శ్రీనుముదిరాజ్, కృష్ణకాంత్, రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకారం



ఎమ్మెల్యే తలసానికి జ్ఞాపికను అందజేస్తున్న గణేష్ దేవాలయ కమిటీ సభ్యులు..

సనత్‌నగర్: ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్‌లోని గణేష్ దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డులోని గణేష్ దేవాలయం నిర్మించి 200 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో కలిసి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ అభివృద్ధి, భక్తులకు కలిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వచ్చే నెలలోఓ ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, సభ్యులు హన్మంతరావు, వినోద్‌కుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## దీప్‌సింగ్ ఆచూకీ కనుగొనేలా చూడండి..

సనత్‌నగర్: నాలుగు రోజుల క్రితం తప్పిపోయిన తమ సోదరుడు దీప్‌సింగ్ ఆచూకీ త్వరగా కొనుగొనే విధంగా చూడాలని అమీర్‌పేటకు చెందిన సర్దార్ టిల్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఈ నెల 20న తన సోదరుడు దీప్‌సింగ్ అత్తాపూర్‌లోని తన కూతురు నివాసానికి వెళ్లారని, అక్కడి నుంచి బయలుదేరిన అతను ఆచూకీ లేకుండా పోయారని వివరించారు. తమ బంధువులు, పరిచయస్తులను కూడా ఆరా తీశామని, ఎక్కడా కూడా జాడ లభించలేదని తన బాధను వ్యక్తంచేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెంటనే రాజేంద్రనగర్ సీఐతో ఫోన్‌లో మాట్లాడి వీలైనంత త్వరగా దీప్‌సింగ్ ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోరారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. అధ్యక్షులు డా.సోమేశ్వర్, గౌరవ అధ్యక్షులుగా గోవిందు, నర్సయ్య, కోశాధికారిగా విష్ణు, ఉపాధ్యక్షులు వరలక్ష్మీ, శివశంకర్, సత్యనారాయణ రెడ్డి, పరుశరామ్, ప్రసన్న, రవీందర్ ఎన్నికయ్యారు.

## కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలోల్లో... టమాటా రూ.17, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 23, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 23, పందిరి బీర 28, క్యాబేజీ 15, క్యారెట్ 50, దొండ 18, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 45, గోకరకాయ 23, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 50, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్వేత

సనత్‌నగర్: అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల (సనత్‌నగర్ ఓల్డ్)కు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్వేత 2023–24 సంవత్సరానికి గాను మెరిటేరియస్ అవార్డును అందుకుంది. అలాగే బాలానగర్, కూకట్‌పల్లి మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ఆలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు ఒక్కొక్కరికి రూ.10 వేలను బహుమతిగా ప్రకటించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా అవార్డుతో పాటు నగదు బహుమతిని శ్వేత అందుకున్నారు. వచ్చే ఏడాది పదో తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లక్ష రూపాయల చొప్పున బహుమతి అందజేయనున్నట్లు దొరరాజు ప్రకటించారు.

## వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్

అడ్డగుట్ట: వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ సూచించారు. ఆదివారం తుకారాం గేట్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతమైన వాతావారణంలో జరుపుకునేందుకు ప్రయత్నించాలని, అందుకు పోలీసులు కూడా సహకరిస్తారన్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మండప పర్మిషన్లకు సంబంధించిన సైట్ అందుబాటులో ఉంటుందని, అందరూ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. అనంతరం, సదరు ఆన్‌లైన్ కాపీని తీసుకొని వచ్చి పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు.

## కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు అధికారులు న్యాయం చేయాలని సంఘం అధ్యక్షులు డా.పరుశురాం కోరారు. తక్కువ వేతనానికి పని చేసి ఉద్యోగ విరమణ చేసే కాంట్రాక్టు అధ్యాపకులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఖాళీ చేతులతో ఇంటికి పంపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాల పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ విరమణలో 60 సంవత్సరాల వయోమితిని పెంచినా ఓయూలో అమలు చేయడం లేదన్నారు.

## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన..



సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. రోజువారీ జీవితం సైన్స్‌తో ఏవిధంగా ముడిపడి ఉంది..వైజ్ఞానిక రంగంలో వచ్చిన మార్పులు..అడ్వాన్స్ టెక్నాలజీ.. రోబోల అప్‌డేట్.. ఇలా సాంకేతికతను అందిపుచ్చుకుని బుల్లి సైంటిస్టులు రూపొందించిన వైజ్ఞానిక ఎగ్జిబిట్లు అందరినీ ఆలోచింపజేశాయి. ఒక వైజ్ఞానిక అంశాలనే కాకుండా చారిత్రక అంశాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి తయారుచేసిన ఎగ్జిబిట్లు కట్టిపడేశాయి. స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ఎగ్జిబిట్లను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ ఛైర్‌పర్సన్ చంద్రకళాయాదవ్, సభ్యులు హెచ్ఎస్ త్రిపాఠి, చంద్రశేఖర్‌గుప్తా, సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.



## బంగ్లాదేశ్‌లో దాడులను అరికట్టాలి



భోలక్‌పూర్ దేవునితోట నుంచి ర్యాలీ నిర్వహించిన హిందూ సంరక్షణ సమితి

ముషీరాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఇతిహాస్ సంకల్పన సమితి నాయకులు శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని దేవుని తోట నుంచి హిందూ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హుస్సేన్‌సాగర్ స్వామి వివేకానంద విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఇతిహాస్ సంకల్పన సమితి సీనియర్ నాయకులు శంకర్ మాట్లాడుతూ.. బాలికలు, మహిళలపై బంగ్లాదేశ్‌లో అత్యాచారం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే దాడుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ సంరక్షణ సమితి నాయకులు ఆంజనేయులు, నాగేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బిజ్జి కనకేష్‌కుమార్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్ రామ్, నాయకులు వనజకుమార్, వెంకటేష్, జగదీష్‌బాబు, శివ, రాజు, నర్సింగ్, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకీకృత పెన్షన్ అమలు అభినందనీయం



మద్దూరి శివాజీ

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమలులోకి తీసుకొస్తామని కేంద్ర నిర్ణయం అభినందనీయమని దీనివల్ల లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని బీజేవైఎం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ అన్నారు. ఆదివారం రాంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఈ కొత్త పథకం వల్ల ఉద్యోగులకు చివరి 12 నెలల మూల వేతనం సగటులో పెన్షన్‌గా 50 శాతం పొందే వెసులుబాటు కల్పించారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కేంద్ర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ఉద్యోగులకు అమలు చేయాలని ఆయన కోరారు.

## పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలె భాస్కర్

ముషీరాబాద్: నియోజకవర్గంలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరిగేలా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు సమిష్టిగా కృషిచేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలె భాస్కర్ సూచించారు. ఆదివారం సాయంత్రం బాకారంలో ముషీరాబాద్ నియోజకవర్గ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం నియోజకవర్గం ఉత్సవ సమితి కన్వీనర్ ఎ.వి నయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటు, నిమజ్జన వేడుకలు, పూజలు వంటి అంశాలపై మండపాల నిర్వాహకులు, పోలీసుల మధ్య ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉత్సవ సమితి సభ్యులు సమన్వయకర్తలుగా వ్యవహరించాలని సూచించారు. మండప నిర్వహకుల సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం గణేష్ ఉత్సవ సమితి ప్రత్యేక యాప్ రూపొందించిందని, సభ్యులందరూ డౌన్‌లోడ్ చేసుకుని మండపాల నిర్వహకులను అందులో చేర్పించాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి విభేదాలు ఘర్షణలు జరగకుండా సభ్యులు కృషి చేయాలన్నారు. ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యులు నాయిని బుచ్చిరెడ్డి, బీజేవైఎం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ, ఉత్సవ సమితి నియోజకవర్గం కన్వీనర్ పరిమళ్‌కుమార్, శివాజీ, సలహాదారులు మహేందర్ బాబు, శక్తిసింగ్, కో- ఆర్డినేటర్లు రాంరెడ్డి, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ మనోభావాలు దెబ్బతీయడం సరికాదు

ముషీరాబాద్: గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీశారని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుసలేము నత్తయ్య విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రైస్తవ ఆధ్యాత్మిక సంస్థల్లో విబేధాలు సృష్టించడం దారుణమన్నారు. పోలీసులు ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఏదైనా న్యాయ సమస్యలు ఉంటే ప్రార్థనల ముందు, ప్రార్థనల తరువాత చర్చించాలని.. దీనికి భిన్నంగా చర్చిలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో పోలీసులు చర్చిలోకి ప్రవేశించి పీటర్‌చారి వర్గాన్ని పోలీసులు దౌర్జన్యంతో బెదిరించడం అన్యాయమన్నారు. సానుకూల వాతావరణంలో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు.

## గురుకులాల సమస్యలు పరిష్కరించాలని..

30న ఇందిరాపార్కు వద్ద ధర్నా



ముషీరాబాద్: రాష్ట్రంలో ఉన్న గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆగస్టు 30న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పొడపంగి నాగరాజులు పేర్కొన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ఈ ధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రధానంగా గురుకులాల్లో 80 శాతం గురుకులాలకు పక్కా భవనాలు లేవని, తక్షణమే గురుకులాలన్నింటికీ సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చదువుకోడానికి, హాస్టల్‌కు వేర్వేరు భవనాల వసతి కల్పించాలన్నారు. ప్రత్యేకించి బాలికల గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గురుకులాలలో ఫుడ్ సెక్యూరిటీ అధికారులతో తనిఖీలు నిర్వహించాలని తదితర డిమాండ్లపైన ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మేధావులు, ప్రజాస్వామికవాదులు హాజరై ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రణయ్, మంద నవీన్, రాష్ట్ర నాయకులు మామిడాల ప్రవీణ్, తీగల శ్యామ్ పాల్గొన్నారు.